క్లుప్తంగా

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

ఆర్మూర్‌టౌన్ : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున ప్రభుత్వం అధికారిక సెలవు ప్రకటించాలని ఉమ్మడి జిల్లాల అధ్యుడు కాత్రోత్ రవీంధర్ అన్నారు. ఆర్మూర్ పట్టణం లోని బంజర సంఘంలో ఆర్మూర్ లంబాడి ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15న రాష్ట్ర ప్రభుత్వం సంత్‌శ్రీ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారని, అలాగే సెలవు ప్రకటించాలని లంబాడిల ఐక్యవేదిక తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి బానవత్ శ్రీనివాస్ నాయక్, మాలోత్ విట్టల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

టీఎన్జీవోస్ అధ్యక్షుడికి సన్మానం



పెర్కిట్(ఆర్మూర్) : ఇటీవల ఆర్మూర్ తాలూకా టీఎస్‌జీవోస్ అధ్యక్షుడిగా నియమితులైన సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జి షికారి రాజు, కార్యదర్శి గోవర్ధన స్వామిని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మూగ ప్రభాకర్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ పట్టణంలోని టీఎస్‌జీవోస్ భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు.

నిత్యాన్నదానం ప్రారంభం



ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటలకు అన్నదానం ఉంటుందన్నారు. సిద్దుల గుట్టపై ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇప్పుడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిత్యాన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పండిత్‌పవన్, ప్రేమ్, పూజ నరేందర్, దొండి శ్యామ్, సుంకరి రవి, కౌన్సిలర్లు తాటి హన్మండ్లు, జనార్ధన్‌రాజు, సుంకరి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



బాల్కొండ : బాల్కొండ మండల రైతుబంధు సమితి నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్, వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుబంధు సమితితో రైతులకు అందుతున్న సేవలను గురించి వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీటీసీ



వేల్పూర్ : నూతనంగా వచ్చిన కలెక్టరు రాజీవ్ గాంధీ హనుమంతును వేల్పూర్ మండల జెడ్పీటీసీ అల్లకొండ భారతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆమె వెంట బిఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌చంద్ర ఉన్నారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

బోధన్‌టౌన్(బోధన్) : మహా శివరాత్రి సందర్భంగా పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయంలో మంగళవారం నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ బీర్కూర్ శంకర్ తెలిపారు. మంగళవారం నుంచి 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్వామి రథోత్సవం, ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని, కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలనుకునే వారు రూ. 1116 చెల్లించాలన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్) : పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రంలో అందరూ వైద్య పరీక్షలు చేసుకోవాలని ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డు కౌన్సిలర్ దూప్‌సింగ్ కోరారు. సోమవారం 4వ వార్డులో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. కౌన్సిలర్ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ రాధాకృష్ణ, పాల్గొన్నారు.

వరాహాలతో వేగేదెలా?

- బాల్కొండ మండల కేంద్రంలోని ఆలయాల్లో స్వైరవిహారం
- భక్తులకు తీవ్ర ఇబ్బందులు



బాల్కొండ మండల కేంద్రంలోని రామాలయం ఎదుట సంచరిస్తున్న పందులు

బాల్కొండ : పవిత్ర గోదావరి తీరంలో ఉన్నకోదండరామాలయం, శివాలయాల్లోకి పందులు ఇష్టారాజ్యంగా ప్రవేశించడంతో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్ట్ కాలనీ(పోచంపాడ్)లో పందుల బెడద తీవ్రంగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయాలను పూర్తిగా అపరిశుభ్రం చేస్తున్నాయని వారంటున్నారు. ఆలయ గర్భగుడిలోకి కూడా పందులు ప్రవేశిస్తున్నాయి. కాలనీలో నిత్యం పందులతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయం వద్ద ఇదివరకే కోతులు తీవ్రంగా ఉన్నాయి. వాటికి తోడు పందులు వస్తున్నాయి. ఓవైపు పందులు, మరో వైపు కోతులు ఆలయాలను చుట్టుముడుతున్నాయి. దీంతో ఆలయాలకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందుల గురించి ఫిర్యాదు చేస్తే కూడా పందుల యజమానులు దాడులు చేస్తున్నారని ఆలయ సంబంధిత అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పవిత్ర గోదావరికి పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు కూడా తిప్పలు తప్పడం లేదు. గోదావరి తీరంలోకి పందులు సంచరిస్తున్నాయి. వంటలు చేసుకుంటే వంట పాత్రలపై దాడులు చేస్తున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల వద్ద పందులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేశాం..

ఆలయాల వద్ద పందులు సంచరించడంపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశాం. కాని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పందుల యజమానులు చెప్పినా ఖాతరు చేయడం లేదు.

– వేణు, ఈవో, దేవాదాయశాఖ

చండీయాగానికి వడివడిగా ఏర్పాట్లు



యాగం సందర్భంగా మాట్లాడుతున్న విశ్వేశ్వర మహాపీఠాధిపతి ప్రణవానంద స్వామి

బోధన్ : మహా శివరాత్రి రోజు కరీంనగర్ జిల్లా విశ్వేశ్వర మహాపీఠం ప్రణవానంద స్వామి సారథ్యంలో బోధన్ చరిత్రలో తొలిసారిగా పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో లోక కల్యాణార్థం 'అయుత చండీ మహాయాగం'ను నిర్వహించనున్నారు. ఈ యాగం మూడు రోజుల పాటు కొనసాగనుంది. రెండు రోజులుగా యాగం నిర్వహణకు ఏర్పాట్లు వడివడిగా కొనసాగుతున్నాయి. సోమవారం యాగ స్థలిలో విశ్వేశ్వర మహాపీఠం స్వామి ప్రణవానంద స్వామి, మారుతి మందిరం ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్‌లు చండీ యాగం వివరాలను వెల్లడించారు. ఈ నెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. కళాశాల మైదానంలో ఎంపిక చేసిన యాగ స్థలిలో 108 యజ్ఞ కుండీలకు సరిపడా పందిరి వేసి 516 జంటలు యాగంలో కూర్చుండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యాగం తొలిరోజు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం వరకు అఖండ దీపారాధన, యాగ ప్రవేశం, గోపూజ, ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. రెండవ రోజు ఉదయం 7–30 గంటలకు ఆయుత చండీ మహాయాగం ప్రక్రియ పూజలు ప్రారంభిస్తామని చండీ పారాయణం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు సాయంత్రం వరకు కొనసాగుతాయని రాత్రి 7.30 గంటల నుంచి శివపార్వతుల కల్యాణ మహోత్సవం, సంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మూడో రోజు ఉదయం ప్రత్యేక పూజలనంతరం దుర్గామాత ఉత్సవ విగ్రహా రథ యాత్రకు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు రూ.5,116 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

బాల్కొండ : గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం బాల్కొండ మండల పరిషత్‌లో ఎంపీపీ యమగంటి లావణ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం నిషేధంపై, ప్లాస్టిక్ నేలల్లో కలిసి పోవుట కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మండల కేంద్రంలో కోతుల బెడదపై తీవ్రంగా చర్చించారు. సాగుకు విద్యుత్తు వేళల్లో మార్పులపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వినోద్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను తొలగించవద్దు'



మాక్లూర్ : అకారణంగా మధ్యాహ్న భోజన కార్మికురాలిని తొలగించడాన్ని నిరసిస్తున్నామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహన్ అన్నారు. గుత్ప ప్రభుత్వ పాఠశాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు కొండ జమునను అకారణంగా తొలగించటాన్ని నిరసిస్తూ మండల మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆమె భర్త తమ పార్టీకి అనుకూలంగా ఉన్నాడనే దురుద్దేశంతో ఆమెను నాయకులు ఒత్తిడి తెచ్చి తొలగింపజేశారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శంకర్‌కు అందజేశారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు రామకృష్ణ, బాల్‌రాజు, భూదేవి పాల్గొన్నారు.

బీజేపీవి మత విద్వేష రాజకీయాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్ : బీజేపీ నాయకులు మత విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం పట్టణ కేంద్రంలోని తన క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే షకీల్ మీడియాతో మాట్లాడారు. పట్టణ కేంద్రంలో వైభవంగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణను ఓర్వలేక బీజేపీ నాయకులు విగ్రహాన్ని ముందు పెట్టుకుని మత రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. తన రైస్‌మిల్లులో బియ్యం కుంభకోణం జరిగిందని ఆరోపణలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీ నారాయణకు తన రైస్‌మిల్లులో సెక్యూరిటీగార్డు, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అందులో ఉద్యోగం ఇస్తానన్నారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి తన హయాంలో రూ. వేల కోట్లు సంపాదించారని, నియోజకవర్గ ప్రజలకు చేసిన మేలు ఏమి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్రయాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ రాష్ట్ర కరాటే చాంపియన్ సిప్ పోటీలు ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బోధన్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటి స్వర్ణ, వెండి పతకాలను సాధించారు. ఈ రాష్ట్రస్థాయిలో పోటీల్లో 10 మంది క్రీడాకారులు విద్యార్థులు కాటాస్, స్పారింగ్‌లో తదితర విభాగాల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించారని కరాటే మాస్టర్ సాయిలు తెలిపారు. ప్రతిభను చాటిన విద్యార్థులకు నుడా చైర్మెన్ జీవీ రామకృష్ణరావు, ఒకినోవా సంస్థ అధినేత చీఫ్ ఆర్గనైజర్ వసంత్‌కుమార్లు మెడల్స్ అందించి అభినందించారన్నారు.

మిషన్ భగీరథ పనుల పరిశీలన

రుద్రూర్ : మోస్రా మండల కేంద్రంలో చేపడుతున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులను సోమవారం ఆర్‌డబ్ల్యూస్ అధికారులు పరిశీలిచారు. మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వెడల్పు పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు పక్కన చేస్తున్న పనులను డీఈ వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఆయనతో ఏఈ నరేందర్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

కొత్త రేషన్‌షాప్ ప్రారంభం

వేల్పూర్ : వేల్పూర్ మండలం హనుమాన్‌నగర్‌లో సోమవారం కొత్త రేషన్‌షాపును బీఆర్‌ఎస్ నాయకులు ప్రారంభించారు. పడగల్ జీపీలో కొనసాగిన హనుమాన్‌నగర్ ఇటీవల కొత్త గ్రామపంచాయతీగా ఏర్పడింది. దాంతో తమకు రేషన్‌షాపు కేటాయించి, స్థానికంగానే సరుకులు పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతూ వచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రాజ్‌కుమార్, శ్యాంరావు, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీలరు శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రుద్రూర్ : రుద్రూర్ మండల కేంద్రంలోని 11వ వార్డులో ఉన్న నీటి సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా రెండు రోజుల పాటు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయాల్సిందిగా జీపీ సిబ్బందిని సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్ ఆదేశించారు. గ్రామంలో నీటి సమస్య ఉన్న ప్రాంతాలను సోమవారం సర్పంచ్ పరిశీలించారు. నీటి సమస్య ఉంటే జీపీలో తెలపాలన్నారు.

'ఉషోదయ'లో క్యాంపస్ సెలక్షన్స్



ఎంపికైన విద్యార్థులతో బృంద సభ్యులు

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ నైపుణ్యాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జెన్‌ప్యాక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్యాంపస్ సెలక్షన్ డ్రైవ్‌లో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, కామారెడ్డికు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు 300 మంది పాల్గొన్నారు. ఈ క్యాంపస్ సెలక్షన్‌లో జెన్‌ప్యాక్ట్ కంపెనీ నిర్వాహకులు శుభ శంకర్, అక్షిత విద్యార్థులకు మొదటి రౌండ్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ మొదటి రౌండ్ ఇంటర్వ్యూలో 135 మంది విద్యార్థులు సెలక్షన్ అయ్యారని కళాశాలల చైర్మెన్ సూర్యప్రకాష్ తెలిపారు. రెండో రౌండ్‌లో కూడా ఎంపికైన విద్యార్థులు తమ ప్రతిభను చాటి సెలక్షన్‌లో ఎంపిక కావాలన్నారు. ఈ క్యాంపస్ సెలక్షన్ డ్రైవ్‌లో టాస్క్ ప్రాంతీయ అధికారి శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ కార్యనిర్వహణ అధికారి సాయిలక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్స్ శైలజ, గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బోధన్‌రూరల్(బోధన్) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో జాతీయ మహిళ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా ముఖ్య అతిథిగా హాజరై ఏఎంసీ మహిళ సిబ్బంది, మహిళ ఏఈవోలను సన్మానించారు.

డిపాజిట్‌లు వాపస్ ఇప్పించాలి



మోర్తాడ్(బాల్కొండ) : ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ సహకార సంఘంలో డిపాజిట్లు చేసిన వారికి డబ్బులు వాపస్ ఇప్పించాలని చైర్మన్ పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో డిపాజిటర్లు సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లోకలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలంను కలిసి విన్నవించారు.

పాస్‌బుక్‌లో నమోదు చేయాలి



ఎడపల్లి(బోధన్) : తనకు పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయ భూమిలో కొంతమేర ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన పట్టాపాస్ పుస్తకంలో నమోదు కాలేదని ఎడపల్లి మండలం జానకంపేట గ్రామానికి చెందిన గుండ్ల సిరిగంధం పోతన్న అనే వ్యక్తి సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తనకు న్యాయం చేయడం లేదని ఆయన వాపోయారు. తనకు పోచారం గ్రామ శివారులో సర్వే.నం. 25,61,62,63లలో 21 గుంటలకు గాను పాస్‌బుక్‌లో కేవలం 18 గుంటలే నమోదై ఉందన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం



ఆర్మూర్‌టౌన్ : ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తున్న ఒకే ఒక యూనియన్ టీఎన్జీవోస్ అని ఆర్మూర్ తాలుక టీఎన్జీవోస్ అధ్యక్షుడు షికారిరాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంగన్‌వాటీచర్‌లు, సూపర్‌వైజర్ జిల్లా కమిటీ సభ్యులు తార, అనురాధ, రమ, హేమతో మరికొందరు టీఎన్జీవోస్‌లో సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలించిన అధికారులు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే షకీల్ ఆవిష్కరించిన శివాజీ విగ్రహం గద్దె నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదేశాలనుసారం మున్సిపల్ అధికారులు సోమవారం స్థలాన్ని డీఈ లింగం పల్లి శివానందం పరిశీలించారు. డీఈ వెంట ఏఈ సాయిలు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు రవిందర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

బాల్యవివాహం అడ్డగింత

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఆదివారం రోజు కెనాల్ కట్టా సమీపంలో జరుగుతున్న ఓ బాల్యవివాహాన్ని చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు అడ్డుకున్నారు. టీచర్స్ కాలనీకి చెందిన మైనర్ బాలికను మామిడిపల్లికి చెందిన వ్యక్తితో వివాహం జరిపిస్తుండగా అధికారులు అడ్డుకుని బాలిక తల్లిదండ్రులతో కౌన్సిలింగ్ నిర్వహించి పెళ్లిని నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నళిని, అంగన్‌వాడి టీచర్ దుర్గా, వివిధ పాల్గొన్నారు.

రోడ్డుపై కబ్జాను తొలగించాలి

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్, హుస్నాబాద్ గల్లీ ప్రాంతంలో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో పాటు దుకాణదారులు రోడ్డుపై రాళ్లను ఏర్పాట్లు చేసుకొని స్థలాలను ఆక్రమిస్తున్నారని హుస్నాబాద్ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ పాత బస్టాండ్ ప్రాంగణంతో పాటు గల్లీ లల్లో వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ఎమర్జెన్సీ ఉన్న సమయంలో అంబులెన్స్ కూడా లోనికి రాని పరిస్థితి నెలకొని ఉందని వారు వాపోయారు. రెండు రోజుల క్రితం పాతబస్టాండ్ సమీపంలో అంబులెన్స్ దారి ఇవ్వాలని అడిగితే గొడవ జరిగిందన్నా రు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చొరవ తీ సు కొని అడ్డంగా ఉన్న కోకాలను, దుకాణాల ఎదుట బండరాళ్లను ఉంచి స్థలాన్ని ఆక్రమించిన వాటిని తొలగించాలని కోరారు.

లారీని ఢీకొన్న బైక్ ఒకరికి తీవ్రగాయాలు



ఎడపల్లి : ఎడపల్లి మండల కేంద్రంలోని బాలిక రెసిడెన్షియల్ పాఠశాల సమీపంలో వంతెనపై సోమవారం రాత్రి లారీని వెనకనుంచి ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న ముదంగల్ బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయని ఎడపల్లి పోలీసులు తెలిపారు. మల్కాపూర్‌లో ఫంక్షన్‌కు హాజరై బోధన్‌లోని బెల్లాల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తలకు తీవ్రగాయాలయ్యాయని, పరిస్థితి విషమంగా ఉందని, జీజీహెచ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాల పెర్కిట్‌లోనే ఉండాలి



ధర్నా చేస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్నజ్యోతిబాపూలే బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను ఎక్కడకి తరలించకుండా అక్కడే కొనసాగించాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. కాగా సోమవారం బీజేపీ, బీజేవైఎం నాయకులు గురుకుల పాఠశాల తరలించవద్దని ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, మాట్లాడుతూ పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. పాఠశాలను పెర్కిట్ నుంచి మునిపల్లి గ్రామంలో తరలించే యోచన చేయడం వల్ల విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ కుమార్, బీజేవైఎం ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు కలిగోట ప్రశాంత్, ఉదయ్‌గౌడ్, సాయినాథ్ రెడ్డి, పెద్దోళ్ల భరత్, పులి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్‌లోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను భక్తిగీతలతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం 51వ సోమవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు శేఖర్‌రెడ్డి, బి.సుమన్, పీసీ గంగారెడ్డి, కౌన్సిలర్లు తాటి హన్మండ్లు, రమేష్, టీఆర్‌ఎస్ నాయకలు శివకుమార్, సుంకరీ రమేష్, పండిత్ ప్రేమ్, పూజ నరేందర్, బి.కిషన్, నక్కల లక్ష్మణ్, మల్లయ్య, చిన్నారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహం



రుద్రూర్(కోటగిరి) : కోటగిరి మండలం స్వయంభూ మహదేవ్ గుట్ట వద్ద 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అఖండ శివనామ సప్తహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 19వరకు సప్తహ కొనసాగుతుందని నిర్వహక కమిటి సభ్యులు పేర్కొన్నారు. కోటగిరి మండలం కొల్లూర్ గ్రామంలో సోమవారం గజానన్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చండీయాగం నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

16న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రుద్రూర్ : రుద్రూర్ మండలం లింగంపల్లి శివారులోని శివాలయంలో దివ్య శిఖర ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలయోగి మల్లారం, పిట్ల కృష్ణ మహరాజ్ ధార్మిక ప్రవచనం, వేద పండితులు దేవల్కర్ నరేష్ శర్మ, భానుప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాల్సిందిగా కోరారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాల పోచమ్మ ఉత్సవాలు



వేల్పూర్ : వేల్పూర్ మండలం పోచంపల్లి గ్రామంలో సోమవారం ముత్యాల పోచమ్మ వార్షిక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమ ఆరాధ్యదైవంగా భావించే ముత్యాల పోచమ్మకు గ్రామస్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, రథోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామంలోని వీధుల గుండా డప్పువాయిద్యాలతో సాగిన రథోత్సవంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీడీసీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.